క్లుప్తంగా

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారం

రంపచోడవరం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మండలంలోని ఆకూరు, వేములకొండ, పెదగెద్దాడ, ముసురుమిల్లి పంచాయతీల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పాల్గొవాలని అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు కోరారు. ఆదివారం ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు) దేవీపట్నం మండలంలో పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని, ఫజుల్లాబాద్, చెలకవీధి, చిన్నభీంపల్లి, మంటూరు కాలనీ, ఏనుగులగూడెం, అగ్రహారం, లోతుపాలెం, కొత్తవీధి, ఎం రావిలంక, పగసనిపాడు, మడపల్లి కాలనీ, కొండమొదలు కాలనీల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

నేడు విశ్వేశ్వరరాజు పర్యటన

చింతపల్లిరూరల్: మండలంలో కొమ్మంగి పంచాయతీ పరిధిలో పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు శనివారం పర్యటించనున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఎమ్మెల్సీ పర్యటన

చింతూరు: ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ శనివారం చింతూరు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు పొల్లూరులో, మధ్యాహ్నం 3 గంటలకు పెదసీతనపల్లి, సాయంత్రం 4 గంటలకు నర్సింగపేట, 5 గంటలకు చూటూరులో ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి తరపున ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని రామలింగారెడ్డి తెలిపారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు చింతూరులోని మసీద్-ఏ-యాసీన్‌లో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకయ్య

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని కింద్ర జంక్షన్ వద్ద సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మర వాహనాల తనిఖీలు చేశారు. ఎన్నికల దృష్ట్యా నర్సీపట్నం నుంచి రాజవొమ్మంగి, జడ్డంగి మీదుగా ఏలేశ్వరం, రంపచోడవరం వైపు వెళ్లే వాహనాలు, లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించినట్టు సీఐ చెప్పారు. ఎన్నికల కోడ్ నియమ నిబంధనలు ప్రతి వాహనచోదకుడు పాటించాలని సూచించారు. ఎస్ఐ వెంకయ్య, సాయుధ పోలీసులు ఉన్నారు.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ఎస్.రాయవరం: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి జరగనున్న పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు మండలంలోని పెదగుమ్మలూరు హైస్కూల్‌లో శనివారం నుంచి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు పీఆర్‌టీయూ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. వచ్చేనెల 26 వరకు కోచింగ్ ఇవ్వనున్నట్టు చెప్పారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని పీఆర్‌టీయూ నాయకులు ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. దాతల సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సమకూరుస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంతం విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు.

ఒకటి నుంచి..

దేవరాపల్లి: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, మండల అధ్యక్షుడు కొరుపోలు శ్రీను తెలిపారు. స్థానిక ఉషోదయ కాన్సెప్ట్ స్కూల్‌లో ప్రారంభిస్తామన్నారు. ఏటా మాదిరిగా ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేస్తామన్నారు. రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో శిక్షణ ఇస్తామని, విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9985250072,9703556257 సంప్రదించాలని కోరారు.

సుజనకోట... ప్రగతి బాట



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సమస్యలకు మోక్షం
- మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- గిరిజనుల హర్షాతిరేకం



సుజనకోటకు తారురోడ్డు

ముంచంగిపుట్టు: అభివృద్ధి, సంక్షేమ ఫలాలు చిట్టచివరి లబ్ధిదారులకూ అందాలని, గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించాలని, గ్రామాల్లో జనం బాగుండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. గడిచిన ఐదేళ్ల పాలనలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి గిరిజన గ్రామాల స్థితిగతులనే మార్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది.

టీడీపీ పాలకుల నిర్లక్ష్యం.. గిరిజనులకు శాపం

నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అధ్వాన దారులు ఉండేవి...తాగునీటి సమస్యతో గిరిజనులు అల్లాడిపోయేవారు.. రవాణా సౌకర్యం లేక కాలినడకన రాకపోకలు సాగించేవారు.. పాఠశాల, ఆస్పత్రుల భవనాలు శిథిలావస్థలో ఉండేవి..ఎప్పుడు కూలిపోతాయోనని గ్రామస్తులు ఆందోళన చెందేవారు.. ఒకప్పుడు మండల కేంద్రానికి పరుగులు పెడితే గాని పనులు జరిగేవి కావు. రహదారి సైతం రాళ్లు తేలి అధ్వానంగా ఉండేది. అప్పటి టీడీపీ యంత్రాంగం, పాలకులు గిరిజనుల సమస్యలపై కనీసం స్పందించలేదు. టీడీపీ పాలకుల నిర్లక్ష్యం గిరిజనుల శాపంగా మారింది. సమస్యలతోనే గిరిజనులు సావాసం చేశారు.

మారిన రూపురేఖలు

జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక ఏజెన్సీ రూపురేఖలు మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల ద్వారా గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాయి. గిరిపుత్రులు ఆర్థికాభివృద్ధి సాధించారు. మన్యంలోని శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి దర్శనమిస్తోంది. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో దశాబ్దాల తరబడి నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యాయి. పాఠశాలలు, ఆస్పత్రుల భవనాలకు మోక్షం కలిగింది. కొత్త భవనాలను ప్రభుత్వం నిర్మించింది. ముంచంగిపుట్టు మండలం సుజనకోట పంచాయతీలో 15 గిరిజన గ్రామాలు ఉన్నాయి. 2017 మంది జనాభా నివసిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లాది రూపాయల నిధులతో ముంచంగిపుట్టు మండల కేంద్రం నుంచి సుజనకోట పంచాయతీ కేంద్రం మీదగా ఒట్టిపుట్టు గ్రామం వరకు తారురోడ్డును వేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో బోర్లు తీసి తాగునీటి కుండీల ద్వారా సుజనకోట గ్రామంలో ఇంటింటికీ నీటి సరఫరా అవుతుంది. దీంతో గ్రామంలో నీటి కష్టాలు తీరాయి.

అభివృద్ధి పథంలో గ్రామాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుజనకోట ఎంపీయూపీ పాఠశాలకు నాడు–నేడు నిధులు రూ.19లక్షలతో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించింది. వనుగుపుట్టు, కుమ్మరిపుట్టు, బీట, గొడ్డిపుట్టు, తోటపుట్టు, కొత్తసుజనకోట గ్రామాల్లో గడప గడప నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం జరిగింది. తాగునీటి బోర్లు, నీటి పథకాలు ఏర్పాటుతో పాటు జెడ్పీ నిధులతో రూ.10లక్షలతో కుమ్మరిపుట్టు గ్రామంలో డ్రైనేజీ సౌకర్యాం కల్పించింది. సుజనకోటలో రూ.48లక్షలతో గ్రామ సచివాలయ భవనం ఏర్పాటు చేసి అన్ని రకాల ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. గడిచిన పుష్కరకాలంగా అధ్వాన స్థితిలో ఉన్న నర్సీపుట్టు పాఠశాల భవనానికి ఐటీడీఏ, పంచాయతీ నిధులు రూ.2.50లక్షలతో పక్కా భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. పంచాయతీలో మొత్తం ఆరు సెల్ టవర్ల వేయడంతో సమాచార వ్యవస్థ పూర్తిగా గిరిజన గ్రామాల్లోకి అందుబాటులోకి వచ్చింది. 12 మంది గ్రామ వలంటీర్లతో గడప వద్దకే పింఛన్లు అందుతున్నాయి.



సుజనకోట పాఠశాలలో డైనింగ్ హాల్



సుజనకోట గ్రామ సచివాలయం

గతంతో పోలిస్తే సుజనకోట పంచాయతీల్లో పలు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కలగడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమంతో పాటు సుపరిపాలన అందించి తమ జీవితాలు మార్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

సుజనకోట పంచాయతీలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు మంజూరైన నగదు

పథకం	లబ్ధిదారులు	జమ అయిన నగదు
వైఎస్సార్ రైతు భరోసా	1980	రూ.2,66,77,500
అమ్మఒడి పథకం	957	రూ. 1,31,43,000
వైఎస్సార్ చేయూత	531	రూ.99,56,250
వైఎస్సార్ పెన్షన్	1516	రూ.1,09,88,550
విద్యా దీవెన, వసతి దీవెన	115	రూ.11,32,067
కోవిడ్–సాయం	680	రూ.6,80,000
వైఎస్సార్ వాహన మిత్ర	48	రూ.4,80,000
జగనన్న చేదోడు	22	రూ.2,20,000

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి



గతంతో పోలిస్తే మా పంచాయతీలో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. సుజనకోట పంచాయతీ కేంద్రానికి తారురోడ్డు వేయడంతో రవాణా కష్టాలు తీరాయి. ఆర్‌బీకే, వెల్నెస్ సెంటర్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రతి గ్రామానికి తాగునీటి బోర్లు , నీటి పథకాలు ఏర్పాటు చేయడం జరిగింది. సుజనకోట పాఠశాలను నాడు–నేడుతో రూపురేఖలే మార్చారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు పనిచేస్తాం.

– వెంగడ రమేష్, సర్పంచ్, సుజనకోట, ముంచంగిపుట్టు మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



మా గ్రామానికి నిత్యం తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉండేవారం. ఎన్నిసార్లు టీడీపీ పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. కాని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలలో నీటి సమస్య పరిష్కారమైంది.సుమారు రూ.5లక్షలతో తాగునీటి పథకం ఏర్పాటు చేశారు.గ్రామానికి సీసీ రోడ్డు వేశారు.ప్రభుత్వ పథకాలు అన్ని అందుతున్నాయి. సీఎం జగనన్న దయవల్ల సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి. చాలా సంతోషంగా ఉన్నాం. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఎస్.రాధాకృష్ణ, గ్రామస్తుడు, గొడ్డిపుట్టు, సుజనకోట పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

ఓటు హక్కుపై అవగాహన



వై.రామవరంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సాయికుమార్



దేవీపట్నంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరావు

వై.రామవరం: మండలంలోని గుర్తేడు పోలీసుస్టేషన్ పరిధిలోని పాతకోట పంచాయతీ తంగన్నకోట, బురదకోట, కొప్పలకోట గ్రామాల్లో మారేడుమిల్లి సీఐ ఆర్.భీమరాజు ఆదేశాల మేరకు ఎస్ఐ పి.సాయికుమార్ శుక్రవారం పర్యటించారు. గ్రామస్తులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ సాయికుమార్ చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేవీపట్నం: జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి సూచనలతో రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు ఇందుకూరుపేటలో ఓటు హక్కుపై గ్రామస్తులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఎటువంటి గొడవలకు పాల్పడకుండా ఉండాలని, ఏ పార్టీని కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టకూడదని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్ట్

నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల శివార్లలో గుళ్లాట, పేకాట, ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్న స్థావరాలపై దాడులు చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.37,130 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వివరాలు.. మల్లునాయుడుపాలెం శివారు ప్రాంతాల్లో లూడో ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నట్టు సమాచారం అందడంతో గురువారం రాత్రి దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.13,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే అమృతపురం శివార్లలో శుక్రవారం గుళ్లాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.14 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఎ.శిరసపల్లి శివారులో పేకాట ఆడుతున్నట్లు శుక్రవారం వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి 6గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టు చేసిన 13 మందిని అనకాపల్లి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



బరడలో గ్రామంలో పర్యటిస్తున్న నాయకులు



బొడ్డాపుట్టులో గ్రామస్తులతో నాయకులు

ముంచంగిపుట్టు: ప్రతి పేదవాడిని ధనికుడిని చేసేలా ముఖ్యమంత్రి జగనన్న పాలన కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు.మండలంలో గల బరడ పంచాయతీ హంసబంధ, సాలగంపుట్టు, గొల్లిపుట్టు, వంద్రంగుల, కోదంజోల, సగ్గులు, బోడ్డాపుట్టు గ్రామాల్లో శుక్రవారం మండల వైఎస్సార్‌సీపీ నేతలు పర్యటించారు. మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగనన్న అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను గ్రామస్తులకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు అందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. పొత్తులతో కుట్ర రాజకీయాలు చేస్తున్న టీడీపీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ జగబంధు, సర్పంచులు పార్వతమ్మ, బాబూరావు, భాగ్యవతి, ఎంపీటీసీలు నబ్బో, సుబ్బలక్ష్మీ, కమల, నేతలు సుందరరావు, సాధురాం, రాంప్రసాద్, తిరుపతి, సన్యాసిరావు, రాజారావు, జగన్నాథం, పులిరాజ, దాసు, విక్రమ్, అప్పారావు, బిస్నాథ్ తిరుపతిరావు పాల్గొన్నారు.

హుకుంపేట: పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం జగనన్నకు వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు అన్నారు. మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పాతకోట పంచాయతీ సోడ, బొడ్డాపుట్టు, మంగళిమామిడి, కొట్నాపల్లి పంచాయితీల్లో పాలం ,దిగమాలపాడు, మాసడ, బాకురు గ్రామాల్లో నాయకులు కలిసి పర్యటించి, గిరిజనులకు జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను, పొందిన లబ్ధి వివరాలను వివరించారు. జగనన్నను గెలిపించేందుకు అందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మెన్ కొండలరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కంబిడి చిన్నబ్బి, నాయకులు రాజారావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



ప్రార్థన చేస్తున్న మాణిక్యం



క్రైస్తవ సందేశాన్ని అందిస్తున్న రెవరెండ్ సంజీవ్‌కుమార్



హుకుంపేటలో శాంతియుత ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



రాజేంద్రపాలెం యునైటెడ్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



రాజవొమ్మంగి సెయింట్ లూథరన్ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



గంగవరం చర్చిలోని ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు



సీతాపురంలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

అరకులోయటౌన్/డుంబ్రిగుడ(అరకులోయటౌన్): గుడ్ ఫ్రైడే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చర్చిల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఏసు క్రీస్తు పునరుత్థాన ప్రాశస్త్యాన్ని పాస్టర్లు వివరించారు. శిలువ గుర్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని బెంజిపూర్ ప్రార్థన మందిరంలో జరిగిన కార్యక్రమంలో అరకులోయ లూథరన్ మిషన్ డైరెక్టర్ బి.ఈ.సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభశుక్రవారం నాడు క్రీస్తు శిలువ మరణం పొందిన రోజు అని, క్షమాపణ, శాంతి, ప్రేమ, రక్షణకు మానవ రూపమే యేసు ప్రభువు అని అన్నారు. క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు. అనంతరం ఆయన దైవ సందేశాన్ని అందించారు. చిన్నారులు క్రీస్తు గీతాలు ఆలపించారు.అరకులోయ, బోసుబెడ, సుంకరమెట్ట బాప్టిస్టు చర్చి, క్రైస్ట్ చర్చి, బెరాక చర్చి, మండలంలోని పలు చర్చిలలో పాస్టర్లు రెవరెండ్ కె.ఎస్.బాబూరావు, భాస్కరరావు, ప్రసాద్, స్టీఫెన్ దైవ సందేశాన్ని అందించారు. డుంబ్రిగుడ మండలంలో అరకు సంతబయలు, డుంబ్రిగుడ, కొర్రాయి, కించుమండ, కొర్రా, తదితర గ్రామాల్లోని చర్చిల్లో దైవ సేవకుల ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అరకులోయరూరల్/అనంతగిరి/హుకుంపేట/కొయ్యూరు : మండలంలో కొత్తభల్లుగుడ చర్చిలో హర్ట్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు మాణిక్యం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొత్తభల్లుగుడ, జనంగుడ, సుంకరమెట్ట, లోతేరు, గన్నెల, చిన్నలబుడు, మాడగడ, పద్మాపురం , చొంపి, వర్ర, పానిరంగిని తదితర గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు దైవ సందేశాన్ని అందజేశారు.అనంతగిరి మండలంలోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థలు నిర్వహించారు. హుకుంపేట మండల కేంద్రంలోని బెతెస్థ, జేసీఈఎఫ్ ప్రార్థన మందిరంతో పాటు అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ జేమ్స్ ఆధ్వర్యంలో శిలువ గుర్తుతో క్రైస్తవులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కొయ్యూరు మండలంలోని రాజేంద్రపాలెం, కాకరపాడు, రావణాపల్లి, శరభన్నపాలెం, మంప, వంతమర్రి, కన్నవరం, గొర్రెలమెట్ట గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.



వీఆర్‌పురం చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ డేవిడ్‌లివింగ్‌స్టన్

ఎటపాక/వి.ఆర్.పురం/గంగవరం/రాజవొమ్మంగి: రంపచోడవరం నియోజకవర్గంలోని ఎటపాక, వి.ఆర్.పురం, గంగవరం, రాజవొమ్మంగి ప్రాంతాల్లోని చర్చిల్లో ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గ్రామాల్లో శిలువ యాత్ర నిర్వహించారు. వి.ఆర్.పురం, గంగవరం, రాజవొమ్మంగి చర్చిల్లో పాస్టర్లు డేవిడ్ లివింగ్‌స్టన్ , ప్రసాద్‌బాబు, విజయవర్మ తదితరులు దైవ సందేశాన్ని అందించారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ



బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేస్తున్న జమాల్‌ఖాన్



బాధితులకు టార్పాలిన్లు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

చింతూరు: మండలంలోని మల్లెతోటలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు స్థానిక జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇళ్లు నిర్మించేందుకు అవసరమైన సిమెంటు రేకులు, ఇనుప రాడ్లతో పాటు నిత్యావసర సరకులను ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ శుక్రవారం బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోని విపత్తుతో బాధితులు సర్వం కోల్పోయి ఎంతో ఆవేదన చెందుతున్నారన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని, ఇందులో భాగంగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటి సామగ్రి, నిత్యవసరాలు, దుస్తులు అందించినట్టు చెప్పారు. ట్రస్ట్ సభ్యులు ఎస్కే సుభానీ, ఇమ్రాన్‌ఖాన్, షాజహాన్, బాబు పాల్గొన్నారు.అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరకులను అందజేశారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లోత రామారావు, నేతలు కిరణ్, సురేష్, వెంకట్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వీఆర్ పురం: మల్లితోట గ్రామంలో గురువారం సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటూంబాలను ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు శుక్రవారం పరామర్శించి తక్షణ సహాయంగా టార్పాలిన్లు, దుస్తులు, మ్యాట్లు తదితర వస్తువులు అందజేశారు. సుబ్రహ్మణ్యం, సిబ్బంది రవి, విహారి పాల్గొన్నారు.